క్లుప్తంగా

నగరంలో ఫ్లాగ్‌మార్చ్



నెల్లూరు(క్రైమ్): ఓటర్లకు భద్రత, భరోసా కల్పించేందుకు నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని శెట్టిగుంటరోడ్డు, వీవర్స్ కాలనీ, నవాబుపేట సెంటర్, జలకన్య బొమ్మ, తడికలబజారు, స్టోన్‌హౌస్‌పేట మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వరకు బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

కంటి అద్దాల పంపిణీ



నెల్లూరు(బారకాసు): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఈఐఎల్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు నగర మేయర్ స్రవంతి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో ధనలక్ష్మీపురంలోని జెడ్పీ హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారన్నారు. అవసరమైన వారికి అద్దాలు ఇచ్చామన్నారు. ఐదుగురికి ఆపరేషన్లు చేయించామన్నారు.

న్యాయశాఖ ఉద్యోగి మృతికి సంతాపం

నెల్లూరు(లీగల్): నెల్లూరు సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జీవీఎంఎల్ నారాయణ బుధవారం సాయంత్రం నవాబుపేటలోని తన స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. దీంతో న్యాయశాఖ ఉద్యోగుల సంఘ నాయకులు, న్యాయవాదులు గురువారం సంతాపం తెలిపారు.

నేత్రదానం



పద్మావతమ్మ (ఫైల్)



మోహన్‌రావు(ఫైల్)

నెల్లూరు(అర్బన్): జనవిజ్ఞాన వేదికలో పనిచేస్తున్న స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సోమిశెట్టి మోహన్‌రావు (68) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబసభ్యుల అంగీకారంతో కళ్లను బుధవారం సేకరించామని ప్రభుత్వ పెద్దాస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీ సింగ్ గురువారం తెలిపారు. అలాగే బాడీని పినాకినీ దేహ సమర్పణ సంస్థతో మాట్లాడి నారాయణ వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ కార్యక్రమానికి రక్త, దేహదాన మోటివేటర్ సుబ్బారావు సహకారం అందించారు.

- స్థానిక రాజేంద్రనగర్ కుక్కలగుంటకు చెందిన అనేపూడి పద్మావతమ్మ (60) గుండెపోటుతో మృతిచెందారు. ఆమె కుటుంబసభ్యుల అనుమతితో నేత్రాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీ సింగ్ ఆధ్వర్యంలో సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి బ్లడ్, ఐ బ్యాంక్ ఇన్‌చార్జి వీవీ సుధీర్ సహకారం అందించారు.

రంగనాథస్వామికి గరుడసేవ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గరుడ పంచమి సందర్భంగా గురువారం శ్రీవారి గరుడసేవ పేట ఉత్సవం కనులపండువగా జరిగింది. మూలవర్లు విశేషాలంకారంలో భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చెన్నారెడ్డి చెంచురామిరెడ్డి, సి.రామచంద్రారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు, కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



రూరల్ నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధి



పార్కును ప్రారంభిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో ద్వారకానాథ్ తదితరులు

- ఎంపీ, సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో నుడా నిధులతో పార్కులను అభివృద్ధి చేయడం జరిగిందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మినీబైపాస్‌లోని అన్నమయ్య సర్కిల్లో రూ.37.10 లక్షల నుడా నిధులతో అభివృద్ధి చేసిన పార్కును గురువారం నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌తో కలిసి ఆదాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ ఈ పార్కు అభివృద్ధికి నోచుకోలేదని, ఇది రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. పదినెలలుగా రూరల్ పరిధిలో సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, ఇతర పనులకు రూ.150 కోట్ల పైగా నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. ద్వారకానాథ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కులను అభివృద్ధి చేశామన్నారు.



పార్టీలో చేరిన వారితో ఆదాల

పార్టీలో చేరిక

టీడీపీ 19వ డివిజన్‌కు చెందిన రాము అతని మిత్ర బృందం ఆదాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీసునంద, 19వ డివిజన్ ఇన్‌చార్జి రవి, లక్ష్మీనారాయణ, కొండేటి శివారెడ్డి, కొండేటి రఘురామ్‌రెడ్డి, జల్లి కుమార్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న విజయసాయిరెడ్డి



నాయకులు, ముస్లిం మత పెద్దలతో విజయసాయిరెడ్డి

నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గురువారం నగరంలోని బట్వాడిపాళెం సెంటర్‌లో ఉన్న నూరుల్ హుదా మసీదు మదరసాలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణంబాక విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రంజాన్ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక పరివర్తన తీసుకొస్తుందన్నారు. ముస్లిం మతపెద్దలు నివాసం, కార్యాలయం నిర్మించుకునేందుకు స్థలం కావాలని, అలాగే నిర్మాణానికి సంబంధించి ఆర్థిక సహకారం అందించాలని కోరగా విజయసాయిరెడ్డి సానుకూలంగా స్పందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మతపెద్ద ముఫ్తీ అబ్దుల్‌వహాబ్ సాహెబ్, సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేస్తా.. ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్



కూరగాయలు విక్రయించే మహిళతో మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడినైన నాకు అవకాశం కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తా' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 48వ డివిజన్ ఆనం వెంకటరెడ్డినగర్, విఘ్నేశ్వరపురం, కోటమిట్ట డౌన్, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలు ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో తమకు పథకాలు అందాయని అనేక మంది చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు, స్థానిక డివిజన్ ఇన్‌చార్జి షేక్ సిద్దీఖ్, నాయకులు పాల్గొన్నారు.

సంతపేట ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



సుబ్బరాజు

నెల్లూరు(క్రైమ్): సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న బి.కళ్యాణ్‌రాజు తాడేపల్లికి బదిలీ అయ్యారు. దీంతో రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎ.సుబ్బరాజును నియమించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఈయన 2009లో పోలీసు శాఖలో ఎస్సైగా విధుల్లో చేరారు. ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. ఈ ఏడాది జనవరిలో సీఐగా పదోన్నతి పొందారు. ఆయనకు ఇది తొలి పోస్టింగ్. బాధ్యతలు చేపట్టాక సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు. ప్రజాజీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేస్తామన్నారు. అనంతరం ఆయన పోలీసు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఏఏకు వ్యతిరేకంగా ర్యాలీ నేడు



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీఏఏ అమలుకు నిరసనగా శుక్రవారం నగరంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), పౌరహక్కుల సంఘం, ఆవాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకుడు కొండ్రగుంట రాంబాబు తెలిపారు. నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న డా.రామచంద్రారెడ్డి భవన్‌లో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీజేపీ మతరాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వారు తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు వామపక్షాలు, లౌకిక ప్రజాతంత్ర శక్తులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకుడు సిరాజ్, ఆవాజ్ జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన నాయకుల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో విజయసాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్



విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు(దర్గామిట్ట): జనసేన నగర ప్రధాన కార్యదర్శి జీవన్‌కుమార్, నాయకులు హరి, బాబ్జీ తదితరులు రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వి.విజయసాయిరెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

విజయసాయిరెడ్డిని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జాన్ బెన్నీ లింగం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కమిటీ సభ్యులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, థామస్, ఫ్రాన్సిస్, ఏసురాజు పాల్గొన్నారు.

పాట విడుదల

నెల్లూరు(బృందావనం): కవి, రచయిత రాచపాళెం రఘు రచించిన 'రాజన్న రాజ్యమే రావాలని చాటరా' పాటను నగరంలో మినీబైపాస్‌రోడ్డు రామ్మూర్తి నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విజయసాయిరెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, రచయిత కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు పొట్టి శ్రీరాములు జయంతి

నెల్లూరు(దర్గామిట్ట): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆరోజు ఉదయం పది గంటలకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నెల్లూరు(టౌన్): స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ కాలేషా విచ్చేసి ప్రస్తుతం ఐటీలో ఉన్న పరిస్థితులు, తీర్చిదిద్దుకోవాల్సిన నైపుణ్యాలు, ఉన్నత స్థానానికి చేరుకునేందుకు చేయాల్సిన పనులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, సీఎస్ఈ హెచ్‌ఓడీ రాజేంద్ర పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్ తినొద్దు

నెల్లూరు(అర్బన్): జంక్‌ఫుడ్ తినొద్దని, మంచి ఆహారపు అలవాట్ల ద్వారా కిడ్నీలను ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని నారాయణ స్పెషాలిటీ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ కొల్లా ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 13వ తేదీ వరకు ప్రత్యేక కిడ్నీ చెకప్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చామన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర, ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న 18 ఆరోగ్యమిత్ర పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు ఇటీవల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/ నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు ఉంచామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అభ్యంతరాలుంటే శుక్ర, శనివారాల్లో ధ్రువీకరణ పత్రాలను దర్గామిట్టలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మోడ్రన్ ఐ రీసెర్చ్ సెంటర్ సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చిన్మయి, వినీల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీ సుబ్బరాజు, ఎస్.రమేష్‌బాబు, వ్యవస్థాపకుడు ఎం.నరేంద్రరెడ్డి, సభ్యులు రాఘవేంద్ర, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా..



స్వామి వారి దవనోత్సవం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ఆదిదంపతుల దవనోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి విశేష పుష్పాలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పులిమి వెంకటరెడ్డి – లలిత దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు, సభ్యులు పర్యవేక్షించారు. ఉత్సవాలు శుక్రవారం రాత్రి నిర్వహించే ఏకాంతసేవతో ముగుస్తాయి.

పేదల సొంతింటి కల సాకారం



లబ్ధిదారులతో కార్పొరేటర్ గౌరి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అన్నారు. నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు 21వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. గురువారం స్థానికంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పేదవారి సంక్షేమం కోసం జగనన్న పోరాటం చేస్తుంటే పెత్తందారులకు దోచి పెట్టేందుకు ప్రతిపక్షాలు ఏకమయ్యాయన్నారు. జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, వీఆర్వో నాగమణి, మీరయ్య, లీలావతి, నాయకులు పెంచలనర్సారెడ్డి, వెంకటరత్నం, రాజారెడ్డి, సాయి, సుబ్బారావు, మాల్యాద్రి, వలంటీర్లు పాల్గొన్నారు.

17న 'ఓటు విలువ తెలుసుకో' కార్యక్రమం



ఆహ్వానపత్రికలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఈనెల 17వ తేదీన 'ఓటు విలువ తెలుసుకో' కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అరిగెపూడి విజయకుమార్ సౌజన్యంతో పురమందిరంలో ఆరోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వానపత్రికలను పురమందిరం ప్రాంగణంలో గురువారం సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహనతోపాటు చైతన్యం కలిగించాలన్న సంకల్పంతో స్వచ్ఛందంగా కార్యక్రమం చేపట్టామన్నారు. పాటలు, నృత్య పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహిక కళాకారులు 77299 42543 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, షఫీ పాల్గొన్నారు.

రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి



ప్రచారం చేస్తున్న రవి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి తొమ్మిది నెలల్లో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. రూరల్‌లోని కొండ్లపూడి గిరిజన కాలనీలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గతంలో తుపాన్ వచ్చినప్పుడు 22 వేల మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారన్నారు. ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలుండే ప్రాంతాల్లోనే ఎక్కువ అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో నెల్లూరు మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ స్వర్ణ జీవన్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ అరవ కామాక్షమ్మ, కొండలపూడి సర్పంచ్ సుజాత, నేతలు జనార్దన్ నాగేశ్వరరావు, పసుపులేటి సుధాకర్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కర్మక్రతువుల భవనం ప్రారంభం



కర్మక్రతువుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(బృందావనం): నగరంలో 48వ డివిజన్ జయలలిత నగర్‌లో సాధారణ నిధులు రూ.50 లక్షలు, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఎంపీ లాడ్స్ కింద రూ.50 లక్షలు మొత్తం రూ.కోటి వ్యయంతో నిర్మించిన కర్మక్రతువుల భవనం (శుభస్వీకరణ నిలయం)ను వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లు, నాయకులు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్‌ను కలిసి కర్మక్రతువుల భవనం అవసరాన్ని వివరించారన్నారు. స్పందించిన ఆయన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. బ్రాహ్మణుల కోసం ఎమ్మెల్యే అనిల్ తన సొంత నిధులు రూ.40 లక్షలతో మినీబైపాస్‌లో కర్మక్రతువుల భవనం నిర్మించి ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పొట్లూరి రామకృష్ణ ఆచారి, నీలి రాఘవాచారి, గుంజి జయలక్ష్మి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు, స్థానిక డివిజన్ ఇన్‌చార్జి షేక్ సిద్ధిఖ్, 49వ డివిజన్ ఇన్‌చార్జి వందవాసి రంగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. గురువారం వెబెక్స్ ద్వారా రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ వివరించారు. అన్ని కళాశాలలు, హైస్కూళ్లలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో సైన్ బోర్డులు, డేంజర్ గుర్తులు, డైవర్షన్ బోర్డులను నేషనల్ హైవే అధికారులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పొదలకూరు – రాపూరు, పొదలకూరు – నెల్లూరు, మర్రిపాడు – ఆత్మకూరు రహదారిపై సమీప గ్రామాల ప్రజలు తమ పశువులను వదులుతున్నారన్నారు. దీంతో వాహనదారులకు రాత్రి సమయాల్లో అవి కనిపించకపోవడం, అడ్డుగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని అన్ని పంచాయతీలకు ఆదేశాలు జారీ చేసినట్లు డీపీఓ సుస్మిత తెలిపారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని సాయిబాబా మందిరం కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై చర్యలు చేపట్టనున్నట్లు నేషనల్ హైవే అధికారులు తెలిపారు. ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయాలని సూచించారు. సమావేశంలో నేషనల్ హైవేస్ పీడీ దేవేష్ గోయల్, ఎన్‌హెచ్‌ఆర్‌అండ్‌బీ డీఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఎస్ఈలు గంగాధర్, అశోక్‌కుమార్, ఎన్ఐసీ, డీఐఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.